క్లుప్తంగా

నాగార్పమ్మ తిరునాళ్లు ప్రారంభం


విశేషాలంకరణలో నాగార్పమ్మ

ఓజిలి: ఓజిలి గ్రామదేవత నాగార్పమ్మ తిరునాళ్లు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామస్తులు పొలిమేర్లలో ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాలను మొదలు పెట్టారు. అనంతరం పొంగళ్లతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. మహిళలు కుంకుమ పూజ చేశారు. తిరునాళ్లు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

నాగార్పమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నాగార్పమ్మ

వాకాడు: మండల కేంద్రమైన వాకాడులో వెలసిన గ్రామ దేవత నాగార్పమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముందుగా రాహుకాలపు దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు కోటేశ్వరరావు అమ్మవారికి ద్రావ్యాభిషేకాలు, పట్టు వస్త్రాలు, పుష్పాలంకరణ గావించి పూజలు చేశారు. గ్రామం చుట్టు పక్కల నుంచి భక్తులు, ఉభయకర్తలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పైపులైన్లు తవ్వే ముందు జాగ్రత్తలు పాటించాలి

ఓజిలి: మండలంలో అత్తివరం, నాయుడుపేట, గూడూరు పరిసర ప్రాంతాల్లో ఏజీఅండ్‌పీ గ్యాస్ పరిశ్రమ రోడ్డు పక్కనే పైపులైను వేశారు. ప్రజలు తవ్వకాలు జరిపే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పరిశ్రమ యాజమాన్యం తెలిపారు. గ్రామస్తులు కొంతమంది రోడ్డు పక్కన తవ్వకాలు జరిపి గ్యాస్ పైపులైన్లను ధ్వంసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ సమయంలో గ్యాస్ లీకై ప్రమాదాలు సంభవించి ప్రాణ, ఆస్తి నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. పైపులైన్లను ధ్వంసం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పైపులైన్లు తవ్వేముందు పరిశ్రమ యాజమాన్యానికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

బాణసంచా దుకాణాలకు నోటీసులు

కోట: మండలంలో ఉన్న బాణసంచా దుకాణాలకు శుక్రవారం ఎస్‌ఐ నాగబాబు నోటీసులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నోటీసులు అందజేశామన్నారు. జూన్ 4వ తేదీ పార్లమెంట్, అసెంబ్లీ ఓట్ల లెక్కింపు, ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా నిల్వచేయడం, అమ్మకాలు సాగించడం చేయకూడదని తెలిపారు. కోట, విద్యానగర్, వెంకన్నపాళెం పరిసరాల్లో ఉన్న హోల్ సేల్ బాణసంచా దుకాణదారులకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు. కోట క్రాస్ రోడ్డు, విద్యానగర్‌లో ఉన్న లాడ్జీల్లో తనిఖీలు చేశారు. కౌంటింగ్ సందర్భంగా బయట వ్యక్తులకు లాడ్జీల్లో గదులు ఇవ్వరాదని యజమానులకు సూచించారు.

కండలేరులో 6.688 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.688 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల వివాదాలతోనే ఎస్‌ఐ సస్పెన్షన్

చిల్లకూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చింతవరం, చిల్లకూరులో జరిగిన ఘర్షణలు, వివాదాలతో గురువారం రాత్రి ఎస్‌ఐ అంజిరెడ్డి సస్పెండయ్యారు. చిల్లకూరు జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ సమయంలో చోటు చేసుకున్న వివాదంతోపాటు ఎన్నికలు ముగిసిన తర్వాత రోజు చింతవరంలో ఓ వ్యక్తిపై దాడి జరిగింది. సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడంతోనే ఘర్షణలు జరిగినట్టు అధికారులు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులందాయి. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు విచారణ చేపట్టి అంజిరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని అగ్రహారపేటలో ఉన్న శ్రీవేమ జూనియర్ కళాశాల వద్ద ఆదివారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. చెన్నైకి చెందిన ఐవీఎఫ్ యాసెస్ ఫెర్టిలిటీ సౌజన్యంతో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ మారంరెడ్డి అభిజ్ఞ వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. పిల్లలు లేని దంపతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9677256873లో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి పోలేరమ్మ జాతర

- ఘనంగా వేడుకలు ప్రారంభం
- ఏర్పాట్లు చేసిన అధికారులు


ఆలయంలో కొలువై ఉన్న గ్రామదేవత పోలేరమ్మ, పోతురాజు


నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ నగరోత్సవం (ఫైల్)

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర ఆదివారం ప్రారంభం కానుంది. నాయుడుపేట పట్టణ నడిబొడ్డున గడియారం కూడలి వద్ద వెలసిన పోలేరమ్మ ఆలయం వద్ద 48 సంవత్సరాలుగా జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. విన్నమాల మజరాగా పిలిచే నాయుడుపేట పోలేరమ్మ జాతరను విన్నమాల గ్రామ పెద్దకాపు శ్రీనివాసులు రెడ్డి, పట్టణంలోని అన్ని వర్గాల వారి సమ్మేళనంతో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే పోలేరమ్మ జాతరను ఆదివారం ఘనంగా ప్రారంభిస్తారు. ముందుగా గ్రామ సరిహద్దుల్లో ఉన్న ఇంటింటికీ వెళ్లి పూజలు చేస్తారు. సోమవారం పోలేరమ్మ ఆలయం వద్ద భక్తులు పొంగళ్లు పెడతారు. అమ్మవారి పుట్టినిల్లు అయిన పడమటి వీధిలో ఉన్న కుమ్మరి ఇంటి వద్ద మట్టితో ప్రతిమను తయారు చేస్తారు. మంగళవారం రాత్రి పట్టణంలోని అంకాళమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి పూజలు చేస్తారు. అనంతరం కుమ్మరి ఇంటి నుంచి అమ్మవారి ప్రతిమను పంచ వాయిద్యాలతో అత్తవారిల్లుగా భావించే శెట్టిపల్లి వారి వీధిలో ప్రత్యేకంగా అలంకరించిన అలంకార గుడి వద్దకు తీసుకువస్తారు. అక్కడ ప్రతిష్టిస్తారు. నీలిశెట్టి శ్రీనివాసులు సోదరుల ఇంటి నుంచి అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో పోతురాజుస్వామి కిరీటం, మణిహారం, వెంకటగిరి రాజాలు బహూకరించిన వెండి హస్తాలు, పాదాలు, పలువురు దాతలు అందించిన ఆభరణాలు అలంకరిస్తారు. అలాగే పులగణం శ్రీనివాసులుశెట్టి ఇంటి నుంచి వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి చీర పూలమాల, పసుపు కుంకుమను అలంకార గుడి వద్దకు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. అనంతరం గ్రామ పెద్దలతో పాటు దేవదాయశాఖ అధికారులు కలిసి విన్నమాల పెద్దకాపుగా పిలిచే అరవభూమి శ్రీనివాసులురెడ్డి, జాతర నిర్వాహకులు, విన్నమాల గ్రామస్తులు దేవత చెంచుకిషోర్ శెట్టి కుటుంబీలకు తాంబూలం అందజేస్తారు. అర్ధరాత్రి బేరిపేట నుంచి ప్రత్యేక పూల అలంకరణలో సప్పరాన్ని తీసుకువచ్చి అందులో అమ్మవారిని ప్రతిష్టించి ఊరేగింపునకు తీసుకువెళతారు. ఈ సందర్భంగా ప్రతి రహదారి ముఖద్వారం వద్ద అమ్మవారిని నిలపడంతో భక్తులు మొక్కలు తీర్చుకుంటారు. ఊరేగింపుగా తీసుకొచ్చి బుధవారం తెల్లవారుజామున గుడి సమీపంలో కొలువుదీరుస్తారు. సాయంత్రం వరకు పోలేరమ్మను భక్తుల దర్శనార్థం ఉంచుతారు. ఈ సందర్భంగా అనేక మంది వెయ్యికళ్ల కుండలతో ప్రదక్షిణ చేసి మొక్కలు తీర్చుకుంటారు. బుధవారం సాయంత్రం విన్నమాల పెద్దకాపు ఆధ్వర్యంలో గ్రామస్తులు పోలేరమ్మ ఆలయం వద్ద ప్రదక్షిణ చేసి హద్దులో పాలి అన్నాన్ని చల్లుతారు. అక్కడి నుంచి అమ్మవారి విగ్రహాన్ని గుడి సమీపంలో పోలేరమ్మ చావడిలోకి తీసుకువెళతారు. వెంటనే పోలేరమ్మకు వేసిన చలువ పందిరి కొమ్మలను తీసుకునేందుకు వేలాది మంది భక్తులు ఉత్సాహం చూపుతారు. రాత్రి అధికారులు, గ్రామపెద్దలు, దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారిని బేరిపేట నుంచి అందంగా అలంకరించి తీసుకువచ్చిన సప్పరంపై కొలువుతీర్చి పట్టణంలో నగరోత్సవం చేస్తారు. అనంతరం అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేయడంతో జాతర ముగుస్తుంది. ఈ జాతరలో నాయుడుపేట పట్టణం నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు.

భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి



నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఎంతో ప్రసిద్ధిగాంచింది. అన్ని కులాల వారు కలిసి జాతరను అత్యంత వైభవంగా జరుపుకుంటాం. గత 38 ఏళ్లగా ఆర్యవైశ్యుల తరపున దేవత కుటుంబ సభ్యులకు సంప్రదాయబద్ధంగా తాంబూలం అందించి జాతర తంతును నిర్వహిస్తున్నారు. – దేవత చెంచుకిషోర్‌శెట్టి

నాయుడుపేట జాతరకు ప్రత్యేకత ఉంది



నాయుడుపేట పోలేరమ్మ జాతరకు ఎంతో ప్రత్యేకత ఉంది. నాయుడుపేటకు చెందిన అనేకమంది విదేశాల్లో ఉన్నా కచ్చితంగా జాతరకు వస్తారు. కులమతాలకు అతీతంగా వేడుకలు జరుగుతాయి. మూడు రోజులపాటు వేడుకలు ఎంతో సందడిగా ఉంటుంది. – పోట్లాపూడి రాజేష్, నాయుడుపేట

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


పట్టబద్ధ వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

గూడూరు రూరల్ : ఎన్నికల నేపథ్యంలో 144వ సెక్షన్ అమలులో ఉందని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం గూడూరు ఒకటో పట్టణ పరిధిలోని అరుంధతివాడ, పొట్టి శ్రీరాములు పార్కు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కొత్త వ్యక్తుల వివరాలను సేకరించడంతో పాటు 17 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఓట్ల కౌంటింగ్‌ను పురస్కరించుకుని గూడూరు పట్టణం, మండలాల్లో కచ్చితంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. నలుగురికి మించి ఒక చోట గుమికూడరాదన్నారు. అలాగే పట్టణ శివారు ప్రాంతాలతో పాటు దళితవాడలు, స్లమ్ ఏరియాల్లో ఉండే వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్తవారు తమ ప్రాంతంలోకి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కౌంటింగ్ రోజున ఊరేగింపు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పట్టణ సీఐ పాపారావు, ఎస్‌ఐ పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష్మీ నరసింహుడి చక్రస్నానం


వివిధ రకాల పుష్పాలతో నిర్వహించిన పుష్పయాగంలో స్వామి, అమ్మవార్లు


లక్ష్మీనరసింహస్వామికి చక్రస్నానం చేయిస్తున్న ఆలయ అర్చక స్వాములు

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చక్రస్నాన ఘట్టాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. తదనంతరం తిరుచ్చి ఉత్సవం చేపట్టారు. ఆలయ అర్చక స్వాములు లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తికి కొలనులో చక్రస్నానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్నానమాచార్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ధ్వజావరోహణం చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఏకాంత సేవ చేపట్టారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా తిమ్మనగారిపాళెంకు చెందిన చిట్టమూరు శ్రీనివాసులురెడ్డి, ఉమామహేశ్వరి, చిల్లకూరుకు చెందిన కొండా రామచంద్రారెడ్డి, భవాని, గూడూరుకు చెందిన సోమిశెట్టి రామసుబ్బయ్య, రాజ్యలక్ష్మీ, చినకట్టువపల్లికి చెందిన మండపాటి మురళీరెడ్డి, రాధ, జనార్ధనరెడ్డి, అనూష వ్యవహరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత యరటపల్లి జానకిరామిరెడ్డి, ఆలయ ఈవో తాతా శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు, కలవకొండ యూత్ పర్యవేక్షించారు.

హంస వాహనంపై విహరించిన కరిమాణిక్యస్వామి



హంస వాహనంలో ఊరేగుతున్న కరిమాణిక్య స్వామి, స్వామివార్లకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేద పండితులు

నాయుడుపేట టౌన్ : తుమ్మూరు గ్రామంలో టీటీడీ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి హంస వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయం వద్ద టీటీడీకి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో చప్పర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి సుప్రభాత సేవ, ఆరాధన, సహస్ర నామార్చన, బలిహరణం, మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ, ఏకాంత సేవ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రి స్వామి, కిషన్ స్వామి, టీటీడీకి చెందిన సుధీర్, హరిరెడ్డి, గ్రామ పెద్దలు కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్‌రెడ్డి, పసల గంగా ప్రసాద్, నరసారెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు విమానోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కరిమాణిక్యస్వామి విమానోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు టీటీడీ అధికారులు తెలిపారు. ఉదయం ఆలయం వద్ద చప్పర ఉత్సవం, సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం


మంత్రి కాకాణిని కలిసిన డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం సృష్టిస్తుందని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం నెల్లూరులో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల అండతో, దేవుని కృపతో వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మళ్లీ సంక్షేమ పాలన వస్తుందనే నమ్మకంతో ప్రజలంతా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలతో టీడీపీ భూస్థాపితం అవుతుందని, చంద్రబాబు కంపెనీ ఇతర దేశాలకు వలసలు వెళ్లాల్సిందేనని చెప్పారు.

కౌంటింగ్ విధులకు హాజరుకావాలి


రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు : తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో జూన్ 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు విధులు కేటాయించిన రెవెన్యూ సిబ్బంది తప్పక పాల్గొనాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బందికి ఎన్నికల కౌంటింగ్ విధులు కేటాయించామన్నారు. ఎవరైనా విధులకు హాజరుకాకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారు కలెక్టర్ అనుమతితో సెలవు తీసుకోవచ్చన్నారు. వీఆర్‌ఏలు జూన్ 3వ తేదీ మధ్యాహ్నం తిరుపతికి చేరుకోవాలన్నారు.

ఘనంగా అగ్నిగుండ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో పాండురంగస్వామి, అగ్నిగుండ మహోత్సవం

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లి, భీమవరం గ్రామాల్లో శుక్రవారం రాత్రి పాండురంగస్వామి అగ్నిగుండ మహోత్సవం ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అర్చకులు కలశ పూజ, మహాహోమం నిర్వహించి అగ్నిగుండాలను సిద్ధం చేశారు. కంకణాలు ధరించిన భక్తులు తొమ్మిది స్నానాలు ఆచరించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, దామెర ప్రసాద్‌నాయుడు, మాజీ సర్పంచ్ బియ్యపు గోవిందురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సుందరరామిరెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీదేవి, గోపాలయ్య, సతీష్‌రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


పాండురంగస్వామి ఉత్సవాల్లో భజనలు చేస్తున్న భక్తులు

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

ఓజిలి:ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ దశయ్య తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 376 ఇళ్లు మంజూరైనట్టు తెలిపారు. వీటిలో 50 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 50 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్టు పేర్కొన్నారు. నుడా పరిధిలో 257 మంజూరు కాగా 130 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి ఇళ్లు త్వరగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోపీఆర్డీ మోహన్, హౌసింగ్ సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం లైన్ల మరమ్మతులు చేపడుతున్నట్టు ఏఈ హరికృష్ణ తెలిపారు. ఈ క్రమంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బాలాజీ గ్రీన్‌సిటీ, బీఎంఆర్ నగర్, లోతువానిగుంట, పాత, కొత్త బీడీ కాలనీలు, భూపయ్య ఎస్టీ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రజలు బాధ్యతగా ఉండాలి


పోలీసులతో కవాతు నిర్వహిస్తున్న ఎస్‌ఐ గోపి

నాయుడుపేట టౌన్ : ఓట్ల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా ప్రజలు సమన్వయం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్‌ఐ గోపి కోరారు. ఆయన శుక్రవారం కేంద్ర పోలీసు బలగాలతో నాయుడుపేటలోని రామకృష్ణాపురం, రాజగోపాలపురం, బేరిపేట, గాంధీపార్కు, శ్రీకాళహస్తి బైపాసు రోడ్డు తదితర ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు


మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

చిల్లకూరు : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 4వ తేదీన కౌంటింగ్ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం రాత్రి చిల్లకూరులోని అంబేడ్కర్ కూడలిలో గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికల రోజు చిల్లకూరులో వివాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రజల మధ్య అలజడి నెలకొందన్నారు. ఈ క్రమంలో కౌంటింగ్ రోజు సంబరాలు జరుపుకోవద్దన్నారు. ఎవరైనా సంబరాలు చేసుకునేందుకు బయటకు వస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం


నాయుడుపేట టౌన్ : అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


గూడూరు రూరల్ : పదవ తరగతి పరీక్ష కేంద్రం వద్ద బందో బస్తు నిర్వహిస్తున్న పోలీసులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలో శుక్రవారం నుంచి ఇంటర్‌మీడియట్, 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రాంభమయ్యాయి. ఇంటర్‌కు సంబంధించి అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పరీక్షలు జరిగాయి. శుక్రవారం తెలుగు, సంస్కృతం సబ్జెక్టులలో 318 మంది హాజరుకావాల్సి ఉండగా 16 మంది గైర్హాజరైనట్లు చీఫ్ మల్లికార్జున తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

10 తరగతిలో 72 మంది హాజరు

10 తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు మొదటి రోజు శుక్రవారం నాయుడుపేట పట్టణంలో జరిగిన తెలుగు పరీక్షకు 249 మంది హాజరుకావాల్సి ఉండగా 72 మంది మాత్రమే హాజరైనట్టు ఎంఈవో మునిరత్నం తెలిపారు. 177 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. పట్టణంలో 10 తరగతికు సంబంధించి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ఎల్‌ఏ సాగరం ఉన్నత పాఠశాల, నారాయణ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు తెలిపారు.

వెంకటగిరి పట్టణంలో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలో నిర్వహించిన ఇంటర్ మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు 196 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 19 మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాల, ఏపీఆర్‌జేసీ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేవారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 161 మందికి గాను 148 మంది, ద్వితీయ సంవత్సరంలో 35 మందికి గాను 25 మంది హాజరైనట్టు ప్రిన్సిపాళ్లు రవికుమార్, సారాబాయ్ తెలిపారు.

గూడూరు పట్టణంలో..

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో పదవ తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలు సజావుగా సాగినట్లు అధికారులు తెలిపారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ శ్రీనివాసరెడ్డి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట డివిజన్ పరిధిలో ఎక్కడైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా నాయుడుపేట డివిజన్‌లోని నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాలతో పాటు అన్ని మండలాల్లో పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే సీఐలు, ఎస్‌ఐలు గ్రామాల్లో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశమై సామరస్యంగా ఉండాలని అవగాహన కల్పించినట్టు చెప్పారు. గొడవలకు పాల్పడబోమని, కలిసిమెలిసి ఉంటామని వారితో ప్రతిజ్ఞ చేయిస్తున్నట్టు తెలిపారు. 17 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5 పోలీస్ మొబైల్ పార్టీలు నిత్యం పహారా కాస్తుంటాయన్నారు. డీఎస్పీతో పాటు సీఐలు, ఎస్‌ఐలు, 11 క్యూఆర్ టీముల పర్యవేక్షణ ఉంటుందన్నారు. పాతనేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు తెలిపారు.

విజయోత్సవాలు, ర్యాలీలపై నిషేధం

కౌంటింగ్ రోజున విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడంపై నిషేధం విధించినట్టు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సహకరించి కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

మెకానిక్‌లపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు


నాయుడుపేట పోలీస్‌స్టేషన్ వద్ద మెకానిక్‌లు, యూనియన్ నాయకులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో మెకానిక్ షెడ్డు నడుపుతున్న మాబాషా, అతని సోదరుడు జాకీర్‌పై కొంతమంది యువకులు దాడి చేయడం దారుణమని యూనియన్ ఖండించారు. వారు శుక్రవారం స్థానిక మెకానిక్‌లతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాలయకోట ప్రాంతానికి చెందిన వ్యక్తి గురువారం రాత్రి మద్యం మత్తులో ఉండి ఆర్టీసీ బస్టాండు వైఎస్సార్ సర్కిల్ సమీపంలో బైక్ నుంచి పడిపోయాడు. అతన్ని స్థానికంగా ఉండే మెకానిక్ జాకీర్ పైకి లేపి సహాయక చర్యలు చేపట్టాడు. మద్యం మత్తులో ఉన్న ఆ వ్యక్తి జాకీర్‌పై తిరగబడ్డాడు. జాకీర్ అన్న మాబాష వచ్చి వారిని వారించా డు. అప్పటికే అక్కడికి చేరుకున్న మాలయకోట ప్రాంతానికి చెందిన వ్యక్తులు మాబాషతో పాటు అతని సోదరుడు జాకీర్‌పై దాడి చేశారు. ఈ సంఘటనపై గురువారం రాత్రి బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం మెకానిక్‌లు సంఘటితమై దాడిని ఖండించి మరోసారి ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి చర్యలు చేపడతామని ఎస్‌ఐ గోపి హామీ ఇచ్చారు.